
''చూడు కరీముల్లా! అన్న అయినా, నాన్న అయినా నువ్వే. ఒకే ఒక్క చెల్లెలు. ఆమెనే నీ పెళ్లికి రాలేదంటే బంధువుల్లో తల ఎత్తుకొని తిరగ్గలవా!? మంచి చెడ్డా అన్నీ ఆలోచించే చెబుతాన్నా- వెళ్లు. వెళ్ళి మీ బావతో, వాళ్ల అమ్మతో మాట్లాడి వచ్చేట్లు చూడు.'' బ్రతిమాలే విధంగా చెప్పింది రోషన్ బీ.

ఖిచ్చిడి, వేరుశనగ చట్నీ, లోబేకె బడియా నంజుకుంటూ ఉదయం నాష్టా తింటూ- ఆమె చెబుతున్న మాటలు వింటున్నాడు కరీముల్లా. ఇష్టమైన నాష్టా. పానివాలా రుచిరుచిగా అనుభూతిస్తూ తింటుంటే- మధ్యలో ఆమె మాటల నివాలేమే కంకర్ (ముద్దలో రాయి) లా అనిపించాయి అతనికి.

నాష్ట చేసి - రాత్రి యింట్లో రిపేరింగ్ చేసిన టీవీ సెట్‌ని షాపుకు తీసుకుని బయల్దేరబోయాడు. మళ్లీ మొదలుపెట్టిందామె.

''ఏంరా! చెప్పింది ఈ చెవిన విని ఆ చెవిన వదిలేయకుండా పోయి - బచ్చీకె ఘర్ వాలొంకు పెండ్లికి తప్పకుండా రావాలని చెప్పు. ఏమంటావు?'' ఆమె వైపు గిరుక్కున తిరిగి - ''నాకీ పెండ్లి వద్దులే అమ్మా! ఇంకో రెండేళ్ళకైనా సౌదీకి పోయి బాగా సంపాదించుకుని వచ్చాక పెండ్లి చేసుకుంటా.'' ఈ పెండ్లి పిలుపులు, అలగడాలు, బ్రతిమాలు కోవడాలు నాచాతకాదు.'' బాధ, అసహనం ఆ గొంతులో ప్రతిధ్వనించాయి.



''అంతమాట ఎందుకులేరా అబ్బీ! నీవు సౌదీకి పోయి కోట్లు సంపాదించి -ఇక్కడ ఎవర్ని సాకాలా!? నీ చేతిలో వున్న రిపేరింగ్ చాలు! వున్నకాడికి తిని పుట్టినవూర్లో మనోళ్ళ మధ్య బతికితే చాలు. నన్ను సాకాలన్న బరువు కూడా ఎంతో కాలం వుండదు. ''ఆజ్ ఘర్మేతొ కల్ ఖబర్మే'' అంది గద్గద స్వరంతో రోషన్‌బీ.

# కంకర్

శశిశ్రీ

''అబ్బ! నోరెత్తితే చాలు రేపోమాపో చచ్చిపోయేదాన్ని.. చచ్చి పోయేదాన్ని అంటావు. ఎప్పుడు నీ మాట తీసేసినా అని- ఇప్పుడు తీసేయడానికి. అట్నే కానీలే. బచ్చి మెహరూన్ యింటికి పోయివస్తా.'' అని టీవీతో ఇంటి గుమ్మంలో కొచ్చి ఆటోకోసం నిలబడ్డాడు.

అటుగా ఆటో ఏదో వస్తుంటే ఆపమని చెయ్యి యెత్తి అందులో ఎవరో వుండటాన్ని చూసి చెయ్యి దింపేసుకున్నాడు.

తమాషాగా ఆ ఆటోనే గుమ్మం దగ్గర ఆగింది. అందులోంచి కుర్తా,

ఫైజామా, కొతిమీర కట్టలాంటి గెడ్డం, సన్నగా జిరాఫీలాంటి పొడవాటి మధ్య వయస్కుడు దిగాడు. సాదరపూర్వక సలాముల తర్వాత...

''కరీముల్లా మీరే కదా.. మీ మేనమామ ఇనాయతుల్లా షరీఫ్ గారు మీ దగ్గరికి పంపినారు. మీ పెండ్లి విషయంగానే వచ్చాను నేను ''సంప్రదాయ శైలి వుర్దూలో చెప్పాడాయన.

ఇండియా- శ్రీలంక క్రికెట్ మొదలవుతుంది. ఈరోజు వుదయానికంతా టీవీ రిపేర్ చేసివ్వాలని డబల్ చార్జ్ అడ్వాన్స్‌గా చెల్లించిన పార్టీకి డెలివరీ ఇద్దామని షాపుకు బయల్దేరిన కరీముల్లాకు ఇంటి దగ్గర్నే బ్రేక్‌పడింది. కాసేపు వెనకాముందు వూగిసలాడినా- సరే అని జిరాఫీ పెద్దాయనను ఇంట్లోకి తీసుకెళ్ళాడు.

''రండి! లోపల కూర్చోని మాట్లాడుకుందాం.'' ఆహ్వానించాడు.

''షుక్రియా'' అంటూ లోపలికి అడుగుపెట్టాడు.

చాయ్ పానీ అయ్యాక వచ్చిన అతను తన భుజం సంచి లోంచి పేపర్ ప్యాకెట్ తీసి కరీముల్లాకు అందించాడు.

''నాపేరు రంగిన్ ఖాన్. మా అబ్బాయి సల్మాన్. మంజుమియ్యా పార్క్ దగ్గర ప్రింటింగ్ ప్రెస్ నడుపుకుంటున్నాడు. నేనేమో వై.వి.స్ట్రీట్‌లో టైలరింగ్ పనిచేస్తుంటాను. మీ మేనమామ ఇనాయతుల్లా శరీష్ నేనూ సిద్దవటంలో కలిసే ఎస్ఎస్ఎల్‌సి చదువుకున్నాం. అప్పట్నించి మా స్నేహితం!!'' సంభాషణ ఆపి ఇల్లంతా ఏరియల్ వ్యూ కళ్ళతోనే చూసేశాడు రంగిన్‌ఖాన్.

''ఇంతకు ఈ ప్యాకెట్ ఏమిటి? మా మామూజాన్ ఇచ్చి పంపారా!?'' అడిగాడు కరీముల్లా.

''అవును? మీ తరపు పెళ్ళి కార్డులు కూడా ఆయనే వేయించారు. చూసుకోండి. సరిగా వంద వుంటాయ్.'' అని గోడకేసి వున్న ఫోటో వైపు పరిశీలించాడు.

''తప్పక వుంటాయ్. అమ్మాజాన్. ఇవి నా పెళ్ళి కార్డులు – మీ అన్నయ్య పంపారు. సరే. మరి మీరేమనుకోనంటే షాపుకు తొందరగా పోవాల్సి వుంది బయల్దేరుదామా!?'' అన్నాడు కరీముల్లా లేస్తూ.

అలానా...రెండు నిముషాలు. మరేం లేదు...మీ పెళ్ళి బట్టలు కట్టి పెట్టమని మామగారు చెప్పారు. కొలతలు తీసుకొని పోతాను. లేదా తీరిగ్గా వున్నప్పుడు రమ్మంటే వస్తాను.'' వచ్చిన పనేంటో నెమ్మదిగా తెలియజేశాడు రంగిన్‌ఖాన్.

''ఇంటి దాకా వచ్చారు. మళ్ళీ రావడం ఎందుకులేండి. కొలతలు తీసుకున్నాకే వెళ్తాడు.'' రోషన్ బీ కలుగజేసుకుని అంది.

''సరే సరే కానీండి.'' అంటూ లేచి నించున్నాడు కరీముల్లా.

భుజం సంచి లోంచి పెన్ను, పుస్తకం, టేపు తీసి డ్రస్సింగ్ కోసం కొలతలు తీసుకోవడం ప్రారంభించాడు. టైలర్లు, బార్బర్లు మాట్లాడే లైబ్రరీలు అనేమాట నిజమే కాబోలు.

''బెహెన్ జీ! ఫోటోలో వుండేది రసూల్ జాన్‌నే కదా! మన కడప టవున్‌లో 1964లో బెంజి లారీ కొత్తగా తెచ్చిన లారీ ఓనర్ ఆయనే. ఇప్పటికీ నాకు గుర్తు. ఎపిడి 1664. డ్రైవర్లు, క్లీనర్లను నమ్మి లారీ వదిలేశాడు. వాళ్లేమో ఇష్టారాజ్యం చేసేశారు. చివరికి లారీని అమ్ముకోక తప్పింది కాదు..'' ఇంకా ఏదో చెప్పబోయాడు.

రోషన్‌బీకి- తమ వూరి వాడు, తన అన్నకు ఫ్రెండు అయినవాడు యిలా తారసపడటంతో పాత జ్ఞాపకాలు మళ్ళీ ఓసారి ''పురానే ఫిల్మ్‌కే గీత్'' లా ఎంజాయ్ చేయాలనుకుంది కాబోలు.

''కరీముల్లా! నీవు తొందరగా పోవాల్సి వుంది కదా! బయల్దేరు. భయ్‌జాన్‌తో మాట్లాడి పంపిస్తా'' అంది రోషన్‌బీ- రంగీన్‌ఖాన్‌ని వుండమన్నట్లుగా.

ఈలోగా సెల్‌రింగ్ కావడంతో ఆన్సర్ చేస్తూ- ''రెడీ అయిపోయింది- ఇదో పదినిముషాల్లో షాపులో వుంటాను. మీరు వచ్చేయండి పట్టుకెళ్దురు కానీ..'' అంటూ టీవీ సెట్టుతో బయటికి నడిచిపోతుంటే-

''మరిచిపోగాకు బచ్చి మెహరూన్ ఇంటికి తప్పక పోయిరా నాయనా?'' అంది రోషన్‌బీ.

''అమ్మా నమాజు చదివి అట్లే వాళ్ళింటికి వెళ్ళివస్తాలే.'' అని బయల్దేరాడు.

షాపు చేరుకోగానే రెడీగా వున్న కస్టమర్ తన టీవీసెట్‌ని తీసుకెళ్ళిపోయాడు. ప్రక్క షాపు కసాబ్ చాన్‌బాష, ఎదురుగా వుండే బార్బర్ ద్వారకానాధ అంతా క్రికెట్ మ్యాచ్ చూడ్డానికొచ్చి చేరారు. ఎవరో కస్టమర్ యిచ్చివెళ్ళిన టీవీని ఆన్ చేశాడు కరీముల్లా. ఇంకా మ్యాచ్ ప్రారంభం కాలేదు. టీ ఆర్డర్ యెవరో యిచ్చారు. అంతా తదేకంగా టీవీ సెట్‌కు అతుక్కుపోయారు.

కరీముల్లాకు క్రికెట్ మ్యాచ్ సంగతేమో కానీ, తన పెండ్లికి వున్న ఒక్క చెల్లెల్ని వాళ్ళ అత్తింటి వాళ్లు ఎందుకు పంపడం లేదో అర్థం కావడం లేదు. మనసంతా ఆలోచనలు చుట్టుముట్టాయి.

రోషన్‌బీ యిప్పటికి పదిసార్లు పది వంకలతో మెహరూన్ వాళ్ళ యింటికి పోయి తన కొడుకు పెండ్లికి పిలుపు చెప్పి వచ్చింది. వెళ్ళిన పదిసార్లూ ఒక్కటే కారణం చెప్పినారు. నెల్లూరుకు రొట్టెల పండుగకు పోతున్నాం. కరీముల్లా నిక్కా రోజే ఆ పండుగ వుంది. మెహరూన్ కూతురికి అయిదేళ్లు వచ్చేవరకు రొట్టెలు చెరువులో వదులుతామని మొక్కుబడి చేసుకున్నారట. ఇది అయిదో ఏడు. ఖచ్చితంగా పోవాల్సి వస్తోందన్నారు. పొరబాటు చేస్తే జరగరానిది జరుగుతుందని అందుకే విధిలేక పోతున్నాం అని చెప్పినారంట.


ఇస్లాంలో యిటువంటి మూఢ ఆచారాలు, నమ్మకాలకు తావు లేదు. వీటిని షిరిక్ అంటారు. అల్లాహ్‌కు షిరిక్ అసలు సహింపు కాదు. భూమి పైన సర్వజీవరాశులకు ఏది యివ్వాలన్నా ఆ సర్వాంతర్యామి అల్లాహ్ ఒక్కడే యిస్తాడు. మరి అదే నిజమైనప్పుడు ఆ అల్లాహ్‌కే ధీటుగా మరొకరిని కానీ మరో శక్తిని కానీ సరిపోల్చి వరపడటం ఎంత దారుణం..

ఆడోళ్ళు ఇంట్లో వుంటారు... వాళ్ళకు తెలియక పోవచ్చు. బావ హైదర్‌కు ఏమైంది? తా అంటే తందాన వంత పాడటం నేర్చుకున్నాడు.

బావ నిక్కా రోజు – ''కట్నం కింద యిస్తామన్న పదిహేను తులాల బంగారంలో రెండు తులాలు తక్కువ వున్నాయి తూకం వేస్తే..'' వాళ్ళ అమ్మ హుసేన్ బీ రాద్ధాంతం చేసింది. నిక్కా మండపంలోకి తన కొడుకుని పంపనంది.

అప్పుడు బావ ''రెండు తులాల కోసం నిక్కాచేసుకో వద్దంటారా.. నలుగుర్లో కట్నం బంగారం కోసం పెళ్ళి ఆపుచేసుకున్నాడని మొహం పై వూస్తారు. ఇచ్చింది చాలు. గొడవలు చేయకండి.'' అని తిరగబడి నిక్కా చేసుకున్నాడు.

ఆరోజు బావ హైదర్ గొప్ప మనసు తెలుసుకుని పొంగిపోయాడు. చదువు పెద్దగా లేక





## ప్రేమంటే తెలుసా మీకు?

మూన్‌మూన్ సేన్ గారాల కూతురు రియా సేన్. రియాలో ప్రత్యేకత ఏమిటంటే నటించేడపుడు ఈమెకి వొంటి మీద బట్టనిలవదు. ఎందుకంటే రియా అందం అలాంటిది. ఇక రివీలింగ్ ఫోటో సెషన్‌కి సై అంటే సై అంటుంది. నటన విషయానికొస్తే దక్షిణాది సినిమాల్లో మంచి మార్కులే కొట్టేసింది. అయితే గియితే ఇక్కడే స్థిరపడతానని కూడా అంటోంది. అయితే రియా అస్మిత్‌తో కలిసి క్లోజ్‌గా వున్న సన్నివేశాలు వీడియో టేపులకెక్కింది. అది తన తప్పు కాదు. అంతా కల్పన అని కొట్టేస్తోంది. కానీ అతనితో కొన్నాళ్లు ప్రేమాయణం నడిపింది కానీ ప్రస్తుతం విడిపోయారు. అని అంటున్నారు చూసినవాళ్లు. అందుకే కామోసు అడిగినా అడగకపోయినా 'ఆం ప్రేమ క్షణికం. దాహం అనంతం. శాశ్వతం.' అంటూ ప్రేమ గురించి ఫిలాసఫీ చెప్తోంది.

పోయినా ఎంతో సంస్కారవంతునిగా వ్యవహరించినాడు అని పొంగిపోయాడు. నమాజుల్లో ఎన్నోసార్లు బావ గొప్ప మనసును శ్లాఘించి ఆయనకు సదా మంచి జరగాలని దువా చేశాడు.

అటువంటి బావేనా ఈరోజు యిలా మారిపోయినాడు. ఈవిధమైన ఆలోచనల్లో మధ్యాహ్నం పన్నెండున్నర గంటలైపోయింది కరీముల్లాకు.

మసీదు మైకు నుండి జుమ్మా నమాజుకు ఆహ్వానం పలుకుతూ అజాన్ శ్రావ్యంగా వినిపించింది.

ఏదో ఒక పరిష్కారం దొరక్కపోదా అన్న ఆత్మ విశ్వాసంతో తలకు టోపీ సరిచేసుకుంటూ మస్జిద్‌లోకి ప్రవేశించాడు కరీముల్లా.

మధ్యాహ్నం రెండు గంటల కంతా జుమ్మా నమాజు అయిపోయి మసీద్ నించి బిల బిల బయటికొస్తున్నారు. కరీముల్లాకు వాళ్ళ బావ హైదర్ ఆ మసీదు గేటు దగ్గర తారసపడినాడు.

ఇద్దరు ఆప్యాయంగా సలామ్ దువాలు చేసుకున్నారు.

"బావ! నీతో మాట్లాడాల్సిన విషయం ఒకటుంది." అన్నాడు.

"పోతాం పా మా ఇంటికి భోంచేసి మాట్లాడుకోవచ్చు." జవాబిచ్చాడు.

"వద్దు బావా. ఇదో ఈ మదరసాలో అయిదు నింషాలు కూర్చోని మాట్లాడుకుంటాం. అభ్యంతరం లేదు కదా.." హైదర్ మొహంలో సూటిగా చూస్తూ అన్నాడు.

ఏ విషయం మాట్లాడుతాడో సులువుగానే వూహించిన హైదర్ పైకి తెలియనట్లే "అబ్బే నాకేం అభ్యంతరం పద. ఆ సిరి సాపపై కూర్చుని మాట్లాడుకుందాం." అని మదరసాలోకి నడిచాడు.

ఎదురెదురుగా బావ, బావమరదులు కూర్చున్నారు.

"చూడు బావా! ఇద్దరం ఇప్పుడే నమాజు చేసి వచ్చాం. సూటిగా అడుగుతున్నాను. నా పెండ్లికి మీరంతా రావడానికి నిజంగా రొట్టెల పండుగేనా అడ్డంకి ప్రమాణసాక్షిగా చెప్పు." అన్నాడు కరీముల్లా.

ఆ ప్రశ్నతో హైదర్ కొంచెం హైరానా పడినా ముందే వూహించిన విషయం కావడంతో కొంచెం సేపు మౌనంగా వుండిపోయాడు.

"జవాబు చెప్పడం నీకిష్టం లేకుంటే వద్దు. ఇంతటితో వదిలేయ్..నీకు ఎలా మంచిదనిపిస్తే అలానే చేయ్.." కరీముల్లా అన్నాడు.

"అదికాదు కరీముల్లా. నీవు నేను- బావ, బావమరదులం కంటే ఎక్కువగా మంచి స్నేహితులం. నీ దగ్గర నిజం ఎందుకు దాయాలి. అడిగినావు ఇక చెప్తా విను." అసలు విషయం చెప్పబోయి మళ్ళీ కొంచెం సేపు మౌనం వహించాడు.

"ఫర్లేదు చెప్పు బావా. నేనేం అనుకోను." చేదు నిజం వినడానికి సిద్ధపడుతూ అన్నాడు కరీముల్లా.

"కొన్ని కొన్ని విషయాలు నాకు ఇష్టం వుండవు. నా కుటుంబ వాతావరణం పాడు చేసుకోవడం నాకు అసలు యిష్టం వుండదు. పెళ్ళయి అయిదేళ్ళ

అవుతోంది. మీ చెల్లెలికి ఏ కష్టం రాకుండా చూసుకొంటున్నాను. నువ్వే చెప్పు. మీ ఇంటికి ఎన్నోసార్లు వచ్చి వెళ్ళింది కదా. ఏనాడైనా 'అన్నా..నా భర్త ఇలా కష్టపెట్టున్నాడు మా అత్త అలా సాధిస్తుందని చెప్పిందా!' చెప్పడానికి వీలు లేదు. ఎందుకంటే ఒక ఇంటి బిడ్డ నా ఇంటి ఇల్లాలుగా వచ్చేశాక ఆమె మంచి చెడ్డలు అన్నీ చూసుకోవాల్సింది మా బాధ్యతే. అది ఒకరు చెప్తే వచ్చేది కాదు. మా మనసుల్లో వుండాలి.'' కొంచెం సేపు ఆగి – అక్కడే వున్న మంచి నీళ్ళ బానలోంచి గ్లాసెడు నీళ్ళు తాగాడు హైదర్.

''ఇంక నీ పెండ్లికి మేమంతా వచ్చే విషయం. రావాలని ఎవరికి మాత్రం వుండదు. తప్పక రావాల్సిందే. మా చేతయిన సాయం పెళ్ళిలో చేయాల్సిందే. కానీ, మా అమ్మ పాతకాలం మనిషి. ఆమె మనసులో మీరు నా పెళ్ళికి యివ్వాల్సిన రెండు తులాల బంగారం గురించి వుండనే వుంది. రెండు తులాలతో అయ్యేది కాదు పోయేది కాదు. ఎందుకో ఈ విషయం ఆమెది మొండిపట్టు.

ఇంతకాలం వూరుకుండిపోయి..తీరా కరీముల్లా పెళ్ళి సందర్భంగా యిలా ఎందుకమ్మా యిబ్బంది పెట్టడం అన్నాను కూడా. దానికి ఆమె ఏమంటుందంటే..

ఏ రోజుకైనా కరీముల్లా పెళ్ళి కాకపోదు. కట్నం తీసుకోకుండా పోడు. ''గానుగలోనే గంటెడు.'' అన్నట్లు మనకు రావాల్సింది రాబట్టుకుంటాం. అతనికీ ఇబ్బంది వుండదు. తీరా పెళ్ళి అయిపోయాక అడిగితే ఏం బావుంటుంది. కరీముల్లా మంచోడే కావచ్చు. వచ్చే ఆయన భార్యకు అంత మంచి మనసు వుంటుందని ఎందుకు అనుకోవాలి. అదేదో పెళ్ళికి ముందే తీసేసుకుంటే గుట్టుచప్పుడు కాకుండా వుంటుందనేది మా అమ్మ మనసులో సంగతి.

అసలు విషయం ఇది. దీనిని బయటికి చెప్పుకోవడం ఆమెకు యిష్టం లేదు. పెండ్లికి రాలేమని నెల్లూరు రొట్టెల పండుగకు మొక్కుబడి తీర్చడానికి పోతున్నామంటే అన్నీ అవే సర్దుకుంటాయని ఆమె మర్మం. ఎంతైనా అనుభవం వున్న పెద్దామె కాదా! ఇంక మన మధ్య బంధుత్వం కంటే స్నేహమే గొప్పది. లేకుంటే బావగా ఈ విషయం చెప్పలేను. ఇదీ వున్న సంగతి. మరేం అనుకోకు.'' – మనసులో, మనుషుల్లో దాగి వున్న మర్మం విప్పాడు హైదర్.

కరీముల్లా వేడి నిట్టూర్పు వదిలాడు. తాను మేనమామ కూతురు నూర్‌జహాన్‌ను ఇష్టపడే చేసుకుంటున్నాడు. కట్నకానుకలేవీ మరీ మరీ వద్దనే చెప్పే చేసుకుంటున్నాడు. కాకపోతే – బిడ్డతండ్రిగా మామూజాన్ కలుగజేసుకుని కొన్ని ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇవన్నీ హైదర్‌కు కానీ, వాళ్ళ అమ్మకు కానీ తెలియవు.

మౌనంగా గంభీరంగా మారిపోయిన కరాముల్లాను గమనించిన హైదర్ మళ్లా ఇలా అన్నాడు.

''కరీముల్లా! నేను వున్న చేదునిజం తెలిపానంతే. నీవు బాధ పడిపోతున్నట్లున్నావు..''

''అబ్బే! అదేం లేదు లే బావా! సరే! మీరు పెండ్లికి తప్పకరండి! ఆ రెండు తులాల సంగతి ఎలాగోలా పెండ్లికి ముందే ఏర్పాటు చేస్తాను..బయల్దేరుతామా!?'' అని కరీముల్లా లేచాడు.

ఇద్దరు మదరసాలోంచి బయటికొచ్చారు.

అతనికి యిక చెల్లెలి ఇంటికి పోవాల్సిన అవసరం కనిపించలేదు. వాళ్ళ మనోభావాలు స్పష్టంగా తెలిసిపోయాయి. బావ పెళ్ళి నాటి బాకీకి తన పెళ్ళికి లింకు పెట్టిన హుసేన్‌బీ అంతర్నాటకం గురించి దిగ్భ్రమపోతూ తన యింటికి బయల్దేరాడు.

గడపలో అడుగు పెట్టగానే ఒక దృశ్యం జిగేల్ మనిపించింది. మేనమామ ఇనాయతుల్లా తన వియ్యపురాలు కాబోయే చెల్లెలికి బంగారు గాజులు చూపిస్తున్నాడు. రోషన్ బీ మొఖం కళకళ లాడిపోతుంది.

''ఇవన్నీ చేయించమని కానీ, కావాలని కానీ ఎవరు అడిగినారు. మీ మామ చేయించినవి అంట. చూపించడానికి తెచ్చినాడు. బాగున్నాయ్ కదా గాజులు.'' అంది రోషన్‌బీ ఇంట్లోకి వస్తున్న కొడుకునుద్దేశించి.

''చాలా బావున్నాయ్!'' ప్రయత్నపూర్వక చిరునవ్వు నవ్వాడు కరీముల్లా.

''రెండు తులాల్లో నాలుగు గాజులు. డిజైన్ ఎంత బాగుందో కాదా..'' స్త్రీ సహజమైన ఆనందాన్ని వ్యక్తీకరించింది రోషన్‌బీ.

బంగారు గాజులు.. మెహిందీ చేతులకు మెరుగులు దిద్దే గాజులు.. మట్టి గాజులపై పెత్తనం చెలాయించే బంగారు గాజులు..స్త్రీ తనాన్ని చాటే మేలి బంగారు గాజులు.. కాబోయే తన ఇల్లాలు నూర్‌జహాన్ చేతుల్లో కళలు పండించే గాజులు..

పోతున్నాయ్, చేజారిపోతున్నాయ్..అదృశ్య శక్తి నిర్దాక్షిణ్యంగా లాగేసుకుంటున్న గాజులు..

చేతుల్లోంచి జారి..ప్రాణం పోసుకుని గాల్లో తేలిపోతున్నాయి. తన ఇల్లాలి చేతుల్లోంచి చెల్లెలి యింటికి తరలిపోతున్నాయి.

నూర్‌జహాన్ చెక్కిళ్ళపై కన్నీటి ధారల్ని మిగిల్చిన గాజులు..

పాడు గాజులు.. వలపు పండించని మనసులేని గాజులు.. మనసులేని మనుషులుంటున్న కుటుంబానికి చేరుకుంటున్న గాజులు...

జరగబోయే సన్నివేశం వూహిస్తున్న కరీముల్లా దిగ్గున తేరుకున్నాడు – రింగ్‌టోన్ మోగడంతో.

''సారెజహాఁసే అచ్ఛా హిందుసా హమారా.. హమారా..'' రింగ్‌టోన్ వినిపిస్తుంది. ఆ రింగ్‌టోన్ హైదర్ బావదేనని గుర్తించడానికి ఎంతో సేపు పట్టలేదు.

సెల్‌ఫోన్ ఆన్ చేశాడు. హైదర్ ఏదో చెప్పాడు. ''చాలా సంతోషం బావా! నేను కూడా నీకు చెప్పిన మాట నిలబెట్టుకుంటాను.'' అని కట్ చేశాడు.

''ఎవర్ది రా ఫోన్ – అల్లునిదేనా!?'' అడిగింది ఆసక్తిగా రోషన్ బీ.

''ఔనమ్మా! రొట్టెల పండగకు వాళ్ళ పక్కింటి వాళ్లు కూడా పోతున్నారంట. మొక్కుబడి ముడుపును వాళ్ళతో పంపించేసి మెహరూన్ ఇంటిల్లిపాది పెండ్లికి వస్తున్నామని చెప్పినాడు.'' అనాసక్తంగా చెప్పాడు కరీముల్లా.

''ఎంతైనా అల్లుడు హైదర్ – చాలా సంస్కారవంతుడురా! ప్రోగ్రామ్ సర్దుబాటు చేసుకున్నారు కాబోలు. అల్లాహ్ ఆయన్ను చల్లగా చూడాల..'' రోషన్‌బీ పొంగిపోతుంది. తన కూతురు ఇంటిల్లిపాదితో వస్తోందని తెలిసి తృప్తిగా వూపిరి పీల్చుకుంది.

తన పాత్ర ఇంకా పూర్తికాలేదని తెలిసిన కరీముల్లా మొహం మాత్రం పాలిపోతోంది.

★

